ప్రవాసి

జీవిత పరిభ్రమణమే అలాంటిది.

వెలుగులోని మానవుడు కొన్నాళ్ళ కా వెలుగును భరించలేక చీకటిని కోరు కున్నట్లే శాంతితో బ్రతికే మానవుడు శాంతిని భరించలేక అశాంతిని కోరు కుంటాడు. అశాంతిని కలిగించే పనులే చేస్తాడు!

అరుణ

రైలు వేగంగా పోతున్నది. పశ్చిమ దిక్పతి గుండెల్లో బడబాగ్నిలా సూర్యాస్తమానం అవుతోంది. అగాధ తమోమయ స్వరూపిణి ఎవరో జగత్తు నాక్రమించాలని ప్రయత్నిస్తోంది. దూరంగా తడిసీ తడియని చీకటి వెలుగుల చీర అంచుల మాటున కొండలు తమ అనంత నగ్న సౌందర్యాన్ని దాచుకోవాలని ప్రయత్నిస్తున్నాయి.

"ఆనందా !"

స్వామి ప్రజ్ఞానంద మందహాసం చేస్తూ ఆనందుని పిలిచారు ఆనందుడు ఉలికిపడ్డాడు ఎవరా పిలిచింది అదే పిలుపు ఎన్ని యుగాలక్రిందటో విన్నాడు. తన జీవితం హఠాత్తుగా మలుపు తిరుగుతూ లోయలో పడబోతుంటె ఇదే పిలుపుతో తనని సక్రమమార్గాన పెట్టాడు.

ఆనందుడు తలెత్తి స్వామి వంక చూశాడు. మందహాసం చేస్తున్న ఆ చూపుల ప్రభావం అనంతమైనది ఆయన వంక చూడలేక తల దించుకున్నాడు

రైలు వేగం అంతకంతకు తగ్గుతున్నది. గమ్యస్థానాన్ని చేరుతున్నాననే ఆనందంతో వెర్రికేక వేసింది

ఇదేనా పూరు

మనస్సులోని వేయిమంది ఆనందులు కంపిస్తున్న కంఠాలతో ప్రశ్నించారు.

అవును. ఇదే వూరు. ఇంకో జన్మ ఎత్తినా మరిచిపోలేని నీ వూరుని.

చిక్కబడుతున్న చీకట్లో కూడ, ఎన్నో ఏళ్ళ క్రిందట చూసిన పరిసరాల్ని చూసి గుర్తుపట్ట గలిగాడు.

ఆనందుడు వణికిపోయాడు. ఎంత ప్రయత్నించినా మనస్సు కుదుట పడ లేదు. ఒక్కసారిగా అతని మానసిక నేత్రానికి జీవితం భూత భవిష్య ద్వర్తమానాలలో మరో కోణంలోంచి దృశ్యాదృశ్యంగా గోచరింపసాగింది.

ఏమిటి జీవితం ? క్షుద్రదీపంముందు చరించే స్వభావం గల నీడలాంటిది జీవితం. దానికి రాగము లేదు. లయ అంతకన్నా లేదు.

ఈ లోకంలో సుఖము దుఃఖము స్థిరమైనవికావు. కాని అవి చరించే ఘడియలు మాత్రం శాశ్వితమని భ్రమపడతాం.

జాగృతిలేని వెలుగు చీకటిలో లీనమై పోయింది. ఆ వెలుగులోంచే చీకటి ఆవిర్భవించినట్లుంది.

రైలు మరోసారి కూత కూసింది.

ఆనందుడు ఉలికిపడ్డాడు అతని నవనాడులు కృంగిపోయినయి. భరించలేని నీరసంతో కూలిపోయాడు. అప్రయత్నంగా కన్నీరు తిరిగింది.

"ఆనందా !"

ప్రజ్ఞానంద మెల్లగా ఆనందునివద్దకు వచ్చారు. ఆనందుడి గొంతు వొణికిపోయింది.

"స్వా..మీ!'' అన్నాడు వెగల్చుకుని. కాని కంఠం భాష్పావరుద్ధమై మాటలు సరిగా రాలేదు.

"ఏడుస్తున్నా వెందుకు నాయనా?"

ఆనందుడు జవాబు చెప్పలేదు. మెల్లగా సజలనేత్రాలను స్వామివంకత్రిప్పివెంటనే తల దించుకున్నాడు.

"భయపడకు ఆనందా. నువ్వు చనిపోయావని లోకం నమ్మింది.'' అన్నారు స్వామి మెల్లగా.

"స్వా...మీ! '' అన్నాడు భావవిహ్వలతకు కంపించిపోతూ.

''ఇంకా భయం దేనికి నాయనా ? ఇవ్వాల్టిదా నిన్నటిదా ? పదిహేను సంవత్సరాల క్రిందట...''

ఆనందుడు ఇక దుఃఖం ఆపుకోలేక పోయాడు. ఆ శక్తి అతనికిలేదు. ఈ క్షణం ఇటువంటిది. అతని జీవితంలో వ్యక్తిగత విప్లవాన్ని సృష్టించింది

తోటి శిష్యు లందరు తమ తమ సంచుల్ని పట్టుకుని సిద్ధమౌతున్నారు దిగటానికి. కాని ఆనందుడికి అవేమీ పట్టలేదు. ఏదో మైకం కమ్మినట్లు కూలబడి పోయాడు.

"లే నాయనా, బాధపడకు" అన్నారు స్వామి మందహాసం చేస్తూ. రైలాగింది.

ఉన్న శక్తి నంతా కూడదీసుకుని మెల్లగా లేచాడు ఆనందుడు. శిష్యులు

ఒకరొకరే దిగుతున్నారు.

"దిగు నాయనా !"

అడుగడుగునా స్వామిఆజ్ఞే తనకి దిక్కు అవుతోంది. కాని దిగుతుంటే నరాలు వణికినయి. రక్తం విపరీతమైన వేగంతో పరుగెత్త సాగింది. ఆనందుడికి బాహ్య స్మృతి పూర్తిగా పోయినట్లే అయింది.

పదిహేను సంవత్సరాల క్రిందట — ఇదే స్టేషను తన జీవితనాటకంలో ముఖ్య పాత్ర వహించింది.

చెడిపోయిన మానవుడి గతచరిత్ర లాంటి దీపం వెలుగుతున్నది స్టేషన్‌లో. దూరంగా, కాలం దాచుకున్న రహస్యాలను వెలికి తీస్తా నని బెదిరిస్తున్నట్లుగా ఎర్రటి సిగ్నలుదీపాలు వెలుగుతున్నాయి నల్లని చీకట్లో.

"స్వామీ, తమరు శిష్యులతో సహా మా గృహంలో —" ఆనందుడు కళ్ళు తెరిచాడు బరువుగా. ఆ వొచ్చిన వ్యక్తి రాజశేఖరంగారు. ఉత్తరీయాన్ని నడుముకు బిగించి స్వామికి నమస్కరిస్తూ అన్నారు.

చుట్టూ జనం జయధ్వానాలు చేస్తూ నిలబడ్డారు.

"నా ఆతిథ్యం స్వీకరించా లని —"

స్వామి రాజశేఖరంగారి వంక వాత్సల్యపూర్వకంగా చూశారు. లీలగా ఆయన చేతిలోని పూర్ణకుంభాన్ని స్పర్శించారు.

"మాకు శివాలయంలో బస ఏర్పాటు చేసుకున్నాం."

"మీ కన్ని సౌకర్యాలు..."

"మా ధ్యానానికి దేవాలయమే అనువైనది."

"ఆతిథ్యానికైనా —"

స్వామి మందహాసం చేస్తూ తల వూపారు.

"రండి స్వామీ."

రాజశేఖరంగారు పూర్ణకుంభంతో స్వాగత మిచ్చి దారితీశారు.

"రా నాయనా, ఆనందా —"

మౌనంగా, యాంత్రికంగా ఆనందుడు స్వామి ననుసరించాడు.

యోగమాయలాంటి చీకటి అలుము కుంది. ఈ నల్లని చీకట్లో అతని ముఖం క్షణక్షణానికి వివర్ణమైపోవటం ఎవరూ గ్రహించలేదు. ఈ ఏకాకి జీవితం విచిత్రమైనది. ఇంకా అతను పరిత్యక్తుడు కాలేదు. ఏకాకితనంలో ఏ ఆనందాన్ని అనుభవించాడోగాని అది నిర్వచించ లేనిది.

శివాలయం చేరుకున్నాక అందరూ వెళ్ళిపోయారు. శిష్యులు స్నానానికి బయలుదేరారు. ఆనందుడు బలహీనంగా స్తంభా న్నానుకుని నిలబడ్డాడు. ఇదే దేవాలయం. ఒకనాడు తన జీర్ణసౌందర్యంతో విలవిల్లాడిన దేవాలయం ఈ నాడు మానవుల పవిత్ర ఆశయాలకు చిహ్నంగా సంస్కరింపబడింది

స్వామి గీతా శ్లోకాలు చదువుతున్నారు. శివుని ముందు వెలిగించిన జ్యోతి మూడోకన్నులా ప్రజ్వరిల్లుతూ వెలుగుతోంది.

''నిర్మాన మోహా జితసంగ దోషా
ఆధ్యాత్మ నిత్యా వినివృత్త కామాః
ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛంత్య మూఢాః పద మవ్యయం
తత్".

నిజంగా స్వామి శ్రీకృష్ణుడై తనకు కర్తవ్యం ఉపదేశిస్తున్నట్లే వుంది.

ఏమిటిది? ఇన్నాళ్ళు సాధన చేసినా మనస్సును జయించ లేకపోతున్నాడు. ఎంత ప్రయత్నించినా మనస్సులోకి మౌనం జొరబడటంలేదు. ఉంటుంది అగ్నిపర్వతాలు పగులుతున్నాయి అతని హృదయంలో. కలలకి హద్దు లేర్పడుతున్నాయి. హృదయానికి మాటలు రావు. వచ్చివుంటే అదో విప్లవాన్ని తెచ్చిపెట్టేది. కాని అంతకన్నా స్పష్టంగా తన భావాలను వెలిబుచ్చుతున్నాయి చూపులు.

జరిగిందంతా కల - అని మరిచిపోదామని ప్రయత్నించాడు. కాని ఎందుకో ఈ ప్రయత్నంలో దుఃఖమే వచ్చింది; ఆపుకోలేకపోతున్నాడు. ఈ దుఃఖానుభూతి విచిత్రమైనది; ఆద్యంతాలు లేనిది. జరామృత్యువులు అంతకన్నా లేవు. అది ఏకపథగామియై హృదయాన్ని శూన్యం చేస్తూ తొలుచుకుపోతున్నది.

"ఆనందా!"

ఆనందుడు ఈ పిలుపుతో పెనుగాలికి కంపించే లతలా కంపించిపోయాడు.

ప్రతిసమాధానం చెప్పలేకపోయాడు

"ఊరుకో నాయనా, స్నానం చేసిరా-" అన్నారు స్వామి జాలిగా ఆనందుని వంక చూస్తూ.

ఆనందుడు మాట్లాడ లేదు. అతని మనస్సు శకల మయిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకున్నాడు ఈ నలభై సంవత్సరాల జీవితం కన్ను మూసి తెరిచేటంతలో ముగిసిపోయినట్లుంది. భవిష్యత్తు భయంకరంగా కనిపించింది. ఒకనాడు వైరాగ్య వాతావరణంలో లక్ష్యం ఎంత స్పష్టంగా కనిపించిందో ఇప్పుడంత అస్పష్టంగా కనిపిస్తోంది ఇప్పుడు లభించిం దేమిటి? భిన్న భిన్నమై అణువుల రూపంలో ఒకడని వెనుక జారిపోతున్న కాలబిందువులు ఏ బిందువూ చేతికి చిక్కటం లేదు అదంతా గతచరిత్రలో కలసిపోయి అతన్ని పరిహసించటానికే పూనుకుంది

వద్దంటున్నా వినక మనస్సు గతల తలుపులు తెరుచుకుని భవిష్యత్తు ద్వారాన్ని బలంగా మూసి పరుగెత్తింది

2

మానవుడు జన్మతోనే దోషికాడు పరిస్థితులు జీవనపథాన్ని మారుస్తూ వుంటయి. పరిస్థితులే మానవుణ్ని



"ఇది మా వీధి కాదుగా !"

ఔన్నత్యానికో అగాధానికో తీసుకుని పోతాయి.

ఆ పరిస్థితులు అలాగే చేసినయి

ఏ స్త్రీకోసరం తను యుగయుగాల నుండి తపస్సు చేస్తూ వేయి కన్నులతో ఎదురు చూశాడో ఆ స్త్రీ, తన మరణానికి చరమగీతం పాడటానికి మంగళ రూపంలో అడుగు పెట్టింది. అలా పెట్టి ఇంకా ఆరునెలలు కూడా కాలేదు!

ఎంత ప్రయత్నించినా, సీత ఎంత చెప్పినా తను ఆ పేకాట మానుకోలేక పోయాడు. మొదట్లో ఎంత డబ్బు వచ్చే దనీ! రోజు రోజూ నోట్లకట్టలు సీతకి చూపిస్తూ తన ప్రతిభకి తనే పొంగిపోయే వాడు. ఈ వ్యసనం తన జీవితంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న మహా విషాదానికి మూల మైంది. కాని అదెవరికి తెలుసు? జీవితం ఇంత తీయగా వుందంటే, దాన్ని మనం అలా వూహించు కోటమే! అదృష్ట మనేది అజ్ఞాతంగా వుంటుంది. అలాగే దురదృష్టం కూడా. కాని జరిగిం దేమిటంటే, ఈ అదృష్టం యొక్క సమగ్రస్వరూపం ఎండమావుల లోని జలంలా వుంది. దొర్లుకుంటూ వచ్చి దురదృష్టపు శిలలకు తగిలి జీవితం ముక్కలై కెరటంలా ఎడిపోయింది.

క్రమంగా ఈ వ్యసనం తనస్వభావాన్ని చూపెట్టడం మొదలుపెట్టింది. ధనం

పోతున్నా లక్ష్యంచేయక పోయినదాన్ని పొందాలనే తీరని తృష్ణతో ఆడటం మొదలుపెట్టాడు. కాని ఆడిన కొద్దీ పోవటం, పోయినకొద్దీ ఆడటం చివరకు సీత మెడలో తాళితప్ప మిగిలిన లక్ష్మి మాయమై అంతటితో ఆగక స్థిర చరాస్తుల పైకూడ తన వెలుగును ప్రసరింప చేసింది. చివరిపైస పోయేదాకా ఆడి, కళ్ళు తెరిచాడు.

ఒక్కసారి వెలుగు వెలిగి చీకట్లు క్రమ్ముకున్నాయి! అనంత వైభవం హారతికర్పూరంలా హరించుకు పోయింది.

ఇంటి కెళ్ళటానికి మనస్కొప్పలేదు. ఒకటిమాత్రం నిజం. ఇంటికిపోతే సీత ఓదారుస్తుంది. కాని ఈ ఓదార్పు ను భరించలేడు. ఆత్మ వెదజల్లే పరిమళమే సానుభూతి. అయినా ఈ పరిమళాన్ని అనుభవించే శక్తిలేదు.

నిద్రాహారాలుమాని ఉన్మత్తునిలా పాడు పడిన దేవాలయంలో ఏడుస్తూ కాలం గడిపాడు. కాలం గడిచినకొద్దీ అతనిపై అతనికే ద్వేషం. వెంకట్రామయ్యనుచూసి అసూయ. అతనే తనకి ఆశలుచూపాడు. కాని చివరికి ఆశ నిరాశ అయి చేతికి అందాక పరిహసిస్తూ నిలబడ్డాడు.

విధి నడిపించే జీవితం తనది. తను స్వతంత్రంగా నడువలేడు. అడుగు వేసే ధైర్యం లేదు.

కసి పరకాష్ఠ నందుకుంది. హృదయంలో వ్యథ అశ్రుజలంద్వారా పరిసమాప్తిని పొందదలిచింది. కాని అతని కన్నుల గిన్నెలకన్నీటిచే అక్షయమైనవి.

ఏదో అవమానం జరిగినట్లనుభూతి. ఒకప్రక్క హృదయం కాలిపోతున్నది. ఏదో చేయాలి.

ఈ రాత్రి సరిగా వెంకట్రామయ్య దురదృష్టవంతుడు. లేకపోతే వర్షమని కూడ చూడకుండా ఈ దారివెంబడి ఎందుకు వస్తాడు?

వర్షం జోరు ఎక్కువైంది. రాత్రి దొంగతనంగా జీవితంలో వచ్చిచేరింది. అప్పుడప్పుడు ఆకాశం హృదయాన్ని బ్రద్దలుచేస్తూ మెరుపులు మెరుస్తున్నాయి.

"ఆగు!"

ఆకాశంలో ఉరుము ఉరిమింది.

వెంకట్రామయ్య భయంగా చుట్టూ చూసి ముందు అడుగు వేయబోయాడు. కాని బలమైన చేతులు ఆయన్ని బంధించి వేసినయి.

"ఎ... వ... రు... ను... వ్వు?" వణికిపోతూ ప్రశ్నించాడు. అతనికి మండిపోయింది. రక్తం వేడెక్కిపోయింది. కోపజ్వాల తాలూకు భుగభుగలు నాసికాపుటల వెంబడి వెలువడుతున్నాయి. శరీరం వణుకుతున్నది. అంతర్వాణి ఇచ్చే సలహాను అతను వినలేక పోతున్నాడు.

"నన్ను నాశనం చేసినవాడివి నువ్వు కదూ?'' కోపంతో బిగ్గరగా అరిచాడు.

ఈ సన్నివేశం భయంకరమైనది. చీకటి అజ్ఞానానికి సంజ్ఞలా అలుము కుంటున్నది. వృక్షాలు గించుకుంటున్నై.

"నే—నా ?" ప్రాణం పోయినంత పనైంది వెంకట్రామయ్యకు. ఆ గొంతు గుర్తు పట్టాడు.

"ను...వ్వే !" అన్నాడు కోపంతో అరుస్తూ. అంతే క్రియచేశాడు. అతని మనస్సు జ్ఞానాన్ని కోల్పోయింది. ఏం చేస్తున్నాడో అతనికే తెలీలేదు. కాని రక్తంలోపడి ముద్దయి మూలుగుతున్న వెంకట్రామయ్యను చూడగానే తెలిసింది ఏంచేశాడో ?

రక్తంతో మలినమైన రాయి వర్షంతో పాపాన్ని కడుక్కుంది.

వెంకట్రామయ్య అటూ ఇటూ పొర్లుతూ మూలుగుతున్నాడు.

వణికిపోయాడు. ఏంచేశాడు తను ? ఇదేనా జీవితానికి ధ్యేయం. ఇదేనా వ్యసనానికి ఫలితం ? వెంకట్రామయ్య రక్తం పాపంలా వర్షపునీటితో కలసిపోతున్నది.

ఈ రహస్యాన్ని బయటపెడతా నని ఒక్కసారి విద్యుల్లత ఆకాశం ఈ మూల నుండి ఆ మూలకి పరుగెత్తింది.

కర్తవ్యతా మూఢుడై నిలబడి పోయాడు. సర్వేంద్రియాలు బంధాలు వేసినట్లు కదల్లేకపోతున్నాయి. చలన రహితమైనాయి. ఇది చైతన్యానికి అవసానదశలా వుంది. దూరంగా ఏవో మాటలు వినబడుతున్నాయి అస్పష్టంగా. ఒక్కసారి మనస్సు పనిచేసింది.

పరుగెత్తాడు అక్కడ్నించి. ఆ భయంకర ప్రదేశానికి దూరంగా పరుగెత్తాడుకాని మనస్సులోంచి ఆ దృశ్యాన్ని దూరం చేయలేకపోయాడు. ఎంత తిరిగినా శాంతి దొరకలేదు. మాటిమాటికి ఆ దృశ్యం మనస్సులో మెదులుతూ అతని లోని శాంతిని చెదరగొట్టినాయి. చేతి కంటిన రక్తపుమరక ప్రపంచంలోని నదీ జలాలన్నిటితో కడిగినా పోదు.

జీవితం రెండు శక్తులమీద ఆధార పడి వుంటుంది. ఒకటి పరిస్థితులు. రెండు దైవం. ఎంత తిరిగినా శాంతి లభించకపోయేసరికి క్రమంగా జీవితం మీద విసుగు జనించింది. ఏదో విరక్తి. జీవిత మంటే నిర్లక్ష్యం ఏర్పడిపోయి నయి. ఎవరికోసరం బ్రతకాలి ?

నిరాశ భవిష్యత్తుకి కత్తెరలువేసింది. ఇక ఏ ఆశ లేదు. జీవించటమే వృథా.

కాని వెలుగున్నంతసేపు నీడ వున్నట్లు, కర్మ వున్నంతసేపు బ్రతుకు వుంటుంది. నదిలో పడినా అతను బ్రతికాడు.

కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు.

"ఎవరు నాయనా నువ్వు ?"

కలలోలా వినిపించినయి మాటలు. మెల్లగా లేచి కూర్చున్నాడు.

"ఆత్మహత్య మహాపాపం కదూ ?"

అతను మాట్లాడలేదు. కాని ఈ ప్రశ్న ఎంత తీక్షణమైందంటే దీనికి జవాబు

చెప్పక తప్పేటట్లులేదు.

"ఏం చేయమంటారు — బాధలు భరించలేక—''

ఆయన నవ్వారు. ఆయనే ప్రజ్ఞానంద. శిష్యు లెవరో క్షీరము తెచ్చి ఇచ్చారు.

"ఇక్కడే వుంటావా? నీకు 'శాంతి' లభించేట్లు చేస్తాను." ఎందుకో అతనికి తన కథ చెప్పా లనిపించింది. ఒంటరిగా తన కథ యావత్తూ చెప్పాడు. కాని సీత సంగతిమాత్రం చెప్పలేదు. సీతకి తను చేసిన అన్యాయం సామాన్యమైందికాదు. కనీసం ఆమె పేరుకూడ ఉచ్ఛరించే అర్హతలేదు తనకు.

ఇదే నిలయమైంది. ఈ పదిహేను సంవత్సరాల జీవితం ఈ ఆశ్రమంతో పెనవేసుకు పోయింది. రోజు రోజుకీ సాధన ఎక్కువ చేసేవాడు. ఒక్కొక్క రోజు సాధనలో ఏవో దివ్యానుభూతులు పొందేవాడు. ఏ అదృశ్యశక్తి అతన్ని జీవితం వెంట పరుగెత్తించి ఈ ఆశ్రమం చేర్పించిందో గాని ఒకవిధంగా దానికి తను కృతజ్ఞుడు. ఏ క్షుద్ర జీవిత పరిస రాలలో పడవలసి వస్తుందోనని భయంతో కృంగిపోయాడు ఒకనాడు. కాని ఇది ఒకందుకు మంచిదే! శారీరకం గానూ మానసికంగానూ ఎంతో మార్పు తెచ్చింది. ఆనందుడు బరువుగా లేచి స్నానానికి బయలుదేరాడు.

3

శివాలయంలో జనం చేరారు.

ఈ రెండు రోజుల్లోను సీత అతనికి కనిపించలేదు. అస లిక్కడ వుందో లేదో? ఎక్కడికి పోయి వుంటుంది? ఎలా బ్రతుకుతుంది?

ఈ ప్రశ్నలకి జవాబు రాదు. కాని ఒకటి మాత్రం నిజం. పోయిన వస్తువు విలువ ఎక్కువ. ఇప్పుడు అంతే! రోజు రోజుకీ సీత విలువ పెరుగుతునే వుంది. కనీసం సీత తనని శిక్షించినా కొంత సంతృప్తి మిగిలేది. ఏది సీత — తన ఆత్మకి ప్రతిరూపం సీత — ఏది?

మనస్సు ఎంతో వ్యథతో ప్రశ్నించింది. అక్కడ నిలువలేకపోయాడు. అసలీ రోజు తను జీవితంలో జీవించటంలేదు. పరిసరాలలో జీవిస్తున్నాడు. ఈ మానసిక కలతకి అసలు తనకే అంతు దొరక్కుండా వుంది. ఏమిటీ యమయాతన— ఇన్నాళ్ళ ధ్యానాని కిదేనా కలిగిన పరిణామం? సర్వ శక్తులు కూడదీసుకుని మనస్సు పూజపై లగ్నం చేశాడు. అలవాటు పడిన నోరు ఆశువుగా మంత్రాలను ఉచ్ఛరిస్తోంది.

'నమ స్సోమాయచ రుద్రాయచ'

కాని మనస్సు విహంగమై ఎగిరి పోయి సీతపై నిలిచింది. ఊహాలనే మనస్సులో నిలిచి ప్రాణప్రతిష్ఠ చేసుకుంది. అందమైన స్రోతస్విని హఠాత్తుగా మలుపు తిరిగి లోయల్లోకి పురికింది. ఏ కఠిన నియమాలు, నిబంధనలతో శరీరము, మనస్సు అరికట్టబడిందో

''అదేమిటయ్యా అలా ఖంగారు పడ్తావు. నీవయస్సులో ఉన్నప్పుడు నాకిదే జబ్బుచేసి తగ్గిపోవలేదూ ?''
"నిజమే ననుకోండి కానీ మీ డాక్టరు ఇంకొకరు కదా."

ఈ నాడు ఈ అనుభూతి వీటన్నిటికి అతీత మైంది.

అతని కళ్ళు అందరిపై తిరుగుతున్నాయి. కాని ఎన్ని చినుకులు పడినా స్వాతి వానకు తప్ప ముత్యపు చిప్ప మూత పడనట్లు సీత కనిపిస్తే తప్ప మనస్సు మూతపడదు. గాలానికి చిక్కుకున్న మత్స్యంలా విలవిల్లాడింది మనస్సు.

పూజ అయిపోయాక జనం తీర్థ ప్రసాదాలు తీసికొని వెళ్ళిపోయారు. రాజశేఖరంగారు శిష్యులతో ప్రసాదాలు స్వయంగా పంచిపెట్టారు.

"ఆలా వున్నావేం నాయనా ? ఇంకా భయంపోలేదా . ఇంతమంది జనంనిన్ను చూశారుగాని, గుర్తుపట్టారా ?''

గర్భగుడిలో ఎవరూలేరు. స్వామి, తను, అంతర్యాల నెరిగిన శివుడు

ఆనందుడు మెదలకుండా వూరుకున్నాడు. అప్రయత్నంగా కన్నీరు ధారలు కట్టి వర్షించింది.

"స్వా...మీ ! ఈ దుఃఖాన్నెందుకు సృష్టించారసలు ?" ఆపుకోలేక గద్గద స్వరంతో ప్రశ్నించాడు.

స్వామి చిరునవ్వు నవ్వారు,

''దుఃఖానికి మూలకారణం వ్యామోహమే నాయనా ! అయినా సుఖం విలువ తెలియా లంటే దుఃఖము ఉండితీరాలి.

నీది సుఖదుఃఖాల కతీతమైన జీవితం. ఈ క్షణికో ద్రేకానికి —" ఆనందుడు నిట్టూర్చాడు.

"ఆత్మ చిద్రూపమైన వెలుగు. సాధన చేయి. పూజచేయి. దానియొక్క స్వరూపాన్ని దర్శించు. అదే పరమార్థం."

ఆనందుడు మెదలకుండా కన్నీటితో స్వామివారి పాదాల నభిషేకించాడు.

సీతసంగతి చెప్పాలనిపించింది స్వామితో. కాని ఏ అదృశ్యశక్తో అతని నోటిని మూసేసింది.

"స్వామీ, భిక్షకు దయచేయండి." వినయంగా రాజశేఖరం నమస్కరిస్తూ అన్నాడు.

"పద నాయనా." ప్రేమగాఆనందుని బుజంమీద చేయివేసి బయలుదేరారు.

మానవ సంకల్పానికి దైవసంకల్పం పూర్తిగా విరుద్ధంగా వుంటుంది. ఈ చివరి నిమిషంలో ఆనందుడు ఆశించింది ఒకటి. కనీసం సీతని చూడకుండా ఈ ఊరినుండి దాటిపోగల నని. కాని ఈ క్షణం విలువ అలాంటిది. సీతనే అతనికి పరిచయం చేసింది.

రాజశేఖరం కుటుంబంలోని వ్యక్తులందరినీ పరిచయం చేస్తూన్నారు.

"ఈమె సీతమ్మ. మా ఇంట్లో పదిహేనుసంవత్సరాలనుండి వంటచేస్తూంది. నిజంగా సీతమ్మేనండి. భర్త వదిలేశాడు. పాపం, అప్పటినుండి ఇక్కడే వుంటున్నది. పేరుకి వంటమనిషేగాని మా ఇంట్లో ఒకమనిషిలా కలిసిపోయింది.

సీత దగ్గరగా వచ్చినమస్కరించింది.

స్వామి వెనుక నున్న ఆనందుడు వణికిపోయాడు. కాళ్ళక్రింది భూమి కదలిపోయిన ట్లయింది. వర్షం లేని పిడుగు పడింది. అశ్రుధారలతో నిండి కళ్ళనెత్తి సీతవంక చూశాడు. సీతలో ఏ భావమూ లేదు. నిర్లప్తంగా వుంది. అసలు తనని చూసినట్టే లేదు. సీత తన్ని గుర్తించలేదా ?

సీత ఇక్కడే వుంది. వంటలు చేసుకుని బ్రతుకుతున్నది. ఎంత హీనమైన జీవితం ప్రసాదించాడామెకు ? ఎవరు దీనికి కారణం. ఆనాడు సీత మాట విని పేకాట మానివుంటే — చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం ?

అతని హృదయాంతరాలలో సప్త సముద్రాలు ఘోషిస్తూ పొంగుతున్నాయి. అతని మీద అతనికే అసహ్యమేసింది. ఎందుకీ బ్రతుకు ? ఈ జీవితం తనకి సరిపడదు.

అతని మనస్సుకు తేలుకుట్టినట్లయింది. బాధతో, వేదనతో అతని ముఖం వివర్ణమైపోయింది. నరాలు విద్యుద్ఘాతం తగిలినట్లు జిల్లుమంటున్నాయి. ఏదో మహాలయస్థితి ఆవరించింది అతన్ని. పాడుబడిన కోవెల అయింది అతని ముఖం.

ఒక్కముద్ద కూడ లోపలికి పోలేదు. క్షణక్షణము సీత దీనవదనమే అతనికి కనిపించి గుండెల్లో శూలంలా గ్రుచ్చు

కుంటున్నది. స్వయంగా సీత వడ్డించ టానికి వచ్చినప్పుడు అతని మనస్సు వెర్రిఆవేశంతో "సీతా, సీతా'' అంటూ పిలించింది. కాని అంతకన్నా బలంగా పెదవులు మూసుకుని ఈ ఆపదనుండి దాటించినయి. ఏదో నిస్పృహ, నిరాశ — అతనికి అధైర్యమావేశించింది.

సీత తనకంటే ఉన్నతురాలు. తను దిగజారిపోయినాడు. మళ్ళీ ఆ రోజులు.. తన జీవితంలోని కన్నీటిని ఆనంద భాష్పాన్ని సమంగా భాగించుకుని పంచు కున్న సీత......తన అపురూపమైన హృదయ సౌందర్యంతో అడుగడుగునా తోడునీడైన సీత — మళ్ళీ ఆ సీతతో —? మళ్ళీ తొలినాటి తీయని అనుభూతి... ఎప్పుడు?

ఎప్పుడు? ఎప్పుడు ఈ మహాశాపానికి విముక్తి?

4

ఉదయం నుండి ఆందోళనతో మన స్సదోలా అయింది.

ఒకనాటిస్థితి అతనికిజ్ఞాపకమొచ్చింది. ఆ దివ్యానుభూతులలో అతనికి దైవదర్శ నము లభించేది. ఆ సమాధిస్థితిలో తన వద్దకు శారదాదేవి నడిచివచ్చినట్లు అను భూతి కలిగేది. తనకి తెలియకుండానే 'నమ స్సోమాయచ రుద్రాయచ నమస్తా మ్రాయ చారుణాయచ.....' నాలుకపై నాట్యం చేసేది మంత్రం.

ధ్యానం చేస్తేగాని మనస్సు ప్రశాంతత నొందదు. శాంతి లేకపోతే బ్రతుకలేడు.

స్నానం చేసివచ్చి ధ్యానానికి కూర్చుందామని బయలుదేరాడు..

నిర్మలమైన చెరువు ఈ వ్యక్తి స్పర్శచే కల్లోలమైపోయింది. అనంత వినీలాకాశం చెరువులోపడి ప్రతిఫలించి ముద్దలుముద్దలుగా ఒడ్డుకు కొట్టుకువస్తు న్నది. భవిష్యత్తు ఒక్కసారి వర్త మానం కాదు. అలా అయితే సృష్టికే వినాశం తప్పదు.

నీటిలో దిగి చుట్టూ కలయజూశాడు ఆనందుడు.

సీత బిందెతో నీళ్ళు ముంచుతున్నది.

అతని మనస్సు చెదిరిపోయింది!

"సీ—తా!" అన్నాడు వగరుస్తూ.

సీత మెల్లగా తలెత్తి చూసింది. వెంటనే సగం నిండిన బిందెను పట్టుకుని పమిటచెంగు నోటికడ్డంపెట్టుకుని దుఃఖాన్నాపాలని ప్రయత్నిస్తూ పరు గెత్తి వెళ్ళిపోయింది.

ఆనందుడు గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు. నిర్జీవమైంది హృదయం.

"ఆనందా! ఇక్కడున్నావా, స్వామి పిలుస్తున్నారు.''

ఆనందుడు తేరుకుని శిష్యులవెంక చూస్తూ, "ఆఁ! వస్తున్నాను'' అన్నాడు.

చీకటి క్రమ్ముకుంటోంది. మలయ మారుతం వేణువు ఊదుతూ పరుగెత్తు

తున్నది. గోపురంనిండా పెట్టిన దీపాలు మినుకుమినుకుమంటూ దూరానికి కనిపిస్తున్నాయి.

స్వామి చాలసేపు తను రచిస్తున్న గీతకు వ్యాఖ్యానాన్ని చెప్పారు వ్రాయటానికి.

చీకటి వెలుగును బానిస చేసుకుంది. చలి ఎక్కువైంది. శిష్యులు నిద్రపోయారు. స్వామి మెల్లగా దక్షిణామూర్తి శ్లోకాలు చదువుతున్నారు శ్రావ్యకంఠంతో. ఊరు నిదురబోయింది. నిశ్శబ్దం తాండవిస్తోంది. ఈ నిశ్శబ్దంలో స్వామి నోటివెంబడి శ్లోకాలు మధురంగా వినిపిస్తున్నాయి.

'విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ
తుల్యం నిజాంతర్గతమ్
పశ్యన్నాత్మని మాయయా బహిరివో
ద్భూతం యథానిద్రయా
యస్సాక్షా త్కురుతే ప్రబోధసమయే
స్వాత్మానమేవాద్వయమ్
తస్మై శ్రీ గురుమూర్తయేనమ ఇదం
శ్రీ దక్షిణామూర్తయే !'

స్వామి మెల్లిగా నిద్రలోకి జారారు.

ఆనందుడు లేచి కూర్చున్నాడు. అందరూ నిద్రబోతున్నారు.

సీత జ్ఞాపకమొచ్చింది. సీతని చూస్తే ఆనాటి సీతలాగే కనిపించింది. ఏమీ మార్పులేదు. తను చేసుకున్న రూప కల్పనకీ సీతకి చాల బేధంవుంది. ఆ రాత్రి ఏమన్నాడు? ఏ ప్రమాణం చేశాడు?

"నువ్విలా మౌనంగావుంటే నాకేం తోచటంలేదు. ఇంకా సిగ్గేనా? పోనీ, అలా మౌనంగా వుండటమే నీ అభిమతమైతే దాన్ని భరించేశక్తి కూడ నాకివ్వు."

సీత సిగ్గుతో నవ్వింది.

"ఇలా నీ నవ్వుతో నా హృదయ వీణను మ్రోగిస్తావని తెలిస్తే, కొండ కోనలు దుర్గమారణ్యాలగుండా నా జీవితాన్ని మోసుకుని వస్తాను."

ఒక్కసారి గత స్మృతి ఉద్రేకం తెప్పించింది.

ఆనందుడు మెల్లగా నడిచి గుడి దాటాడు. ఈ పదిహేను సంవత్సరాలలో తను సాధించిన నిగ్రహాన్ని ఈ ఒక్క క్షణం చెదరగొట్టివేసింది.

చీకట్లో చెరువు నిద్రబోతుంది, మాయ ఆవరించినట్లు. అంతర్వాణి హెచ్చరికల్లా కప్పలు చెరువులో నుండి అరుస్తున్నాయి. చలి చీకటి కలిసిపోయినయి. ఈ చలి చీకటుల అద్వైతాన్ని భగ్నం చేసేశక్తి ఎవరికీ లేదు.

"సీ—తా!"

సాధ్యమైనంత మెల్లగా పిలిచాడు. సీత పలకలేదు. మెల్లగా తలుపు తట్టాడు.

"సీతా!"

తలుపు తెరుచుకుంది. ఎక్కడికి పోయినా చీకటి వెంటాడుతునేవుంది.

ఇంట్లో లాంతరు గ్రుడ్డివెలుగు వెద జల్లుతున్నది. భర్త విడిచిపెట్టిన భార్య ఆక్రందనలా వుంది వెలుగు.

"సీతా:" బరువుగా ఉన్నయి మాటలు.

శూన్యమైన ఇల్లు ప్రతిధ్వనించింది!

సీత జవాబు చెప్పలేదు. అసలు లేదు ఆ ఇంట్లో! ఇల్లంతా ఉన్మత్తునిలా తిరిగాడు. ఏమైంది సీత? ఏది తన సీత? తన జీవితకథలో ఉపాఖ్యానంగా మలుచుకున్న సీత—ఏది?

మంచంమీద మెరుస్తూ కనపడింది ఉత్తరం.

"మీరు వస్తారని ఊహిస్తూ ఈ ఉత్తరం వ్రాస్తున్నాను - నేను వెళ్ళిపోతున్నాను. నన్ను మళ్ళీ వెతక్కండి. మీరు యోగులు. సర్వసంగపరిత్యాగులు. నా కోసరం చలించి పోవటం తప్పు. కూడని పని. మీకు అందబోయే మహాఫలాన్ని నేను దూరంచేయను. జీవితం పరిమితమైంది. మీరు నన్ను స్వీకరించినా నేను మిమ్మల్ని స్వీకరించలేను.

"నరూప మస్యేహ తథోపలభ్యతే
నాంతో నచాదిర్నచ సంప్రతిష్ఠా,
అశ్వత్థమేనం సలిరూఢ మూల
మసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా."

"సీతా—" నిట్టూర్చాడు బరువుగా. ఆనందుడి ముఖం పాలిపోయింది. అతనికి తెలియకుండానే దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఇది కలా? 'భ్రాంతా? ఈ స్వప్నావస్థ ఎంతసేపుందో అతనికే తెలియదు. జీవితంలో మహావిషాదాన్ని ఇప్పుడే స్పర్శించాడో? కాని కళ్ళు తెరిచేసరికి దూరంగా దేవతలు వెలిగించిన మహాజ్యోతిలా ఉషోదయమైంది.

ప్రపంచంలోని తమస్సు ఏకమై కాలువై ప్రవహించి ఆ జ్యోతిలో లీనమైపోతున్నది.

అతని హృదయంలోనూ దీపం వెలిగింది. యుగయుగాలనాటి జడత్వం కాలువై ప్రవహించి ఆ దీపంలో లీనమైపోయినయి. ఆ జ్వాలయొక్క వేడికి 'మమత' ఆవిరై పోయింది. ప్రేమయొక్క నిజస్వరూపదర్శనమైంది. నిజంగా జరిగే దిదే! ప్రేమ యొక్క నిజస్వరూపం అది భగ్నమైననాడుకాని తెలీదు. అప్పుడది త్యాగమౌతుంది.

ఆ ఇంటికి తనకు వున్న మమతా బంధానికి కన్నీటితో తిలోదకం వదిలి శివాలయం వైపు బయలుదేరాడు ఆనందుడు! ★